# కడుపు చిచ్చు

ఒక కాలనులో ఒక కొంగ ఉండేది. అది చాలా ముసలిదైపోయి, దగ్గిరగా వచ్చిన చేపలనుకూడా చటుక్కున పట్టుకోలేకపోయేది. అందువల్ల దానికి తిన్నరోజులకన్న పస్తులున్న దినాలే ఎక్కువ అయాయి.

ఇలాగ ఉండగా ఆ కొంగకు ఒకనాడు ఒక మంచి పెద్ద చేప లభించింది. చాలా ఆకలిగా ఉన్న కొంగ ఆత్రుతతో దాన్ని భక్షిద్దామనుకునేసరికి ఎక్కడనుంచో ఒక మనిషి వచ్చి, కొంగ నోటిలోంచి ఆమత్స్యాన్ని లాక్కుని తనబుట్టలో పడేసుకున్నాడు!

కొంగ ఆశాభంగంవల్ల కలిగిన దుఃఖంతో, 'దుర్మార్గుడ, నానోట్లో ఉన్న కూటిని లాక్కున్నావేమిరా? నా చేపను ఇచ్చెయ్యి!' అన్నది.

వాడు వికటంగా నవ్వుతూ, 'నీ చేపా? నీదైతే నా బుట్టలో ఎందుకుంటుంది?' అని చరచరా తన యింటికి పోయాడు.

ఆకలివల్ల కలిగిన నీరసానికి ఆశాభంగంవల్ల కలిగిన దుఃఖంతోడై పాపం ఆ కొంగ ఇంక చేపలకోసం ప్రయత్నించనేలేదు. కొన్నిరోజులలాగ పస్తులుండి, ఆఖరి కొకనాడ కొంగ ప్రాణాలు విడిచేసింది.

కొంగ యొక్క సిద్ధాన్నాన్ని ఎత్తుకుపోయిన ఆ దుర్మార్గుడు వెళ్ళి ఆ చేపను తన భార్యకు ఇచ్చాడు! 'మంచిచేపనే సంపాదించావే!' అని మెచ్చుకుంటూ ఆమె దాన్ని కూరవండి, వాడికి సగంపెట్టి తాను సగం తిన్నది.

మరికొన్నాళ్ళకామె కడుపుతో ఉండి, తొమ్మిదనెలలూ నిండేక గుమ్మడిపండువంటి కొడుకును కన్నది.

ఆ బాలుణ్ణి వాళ్లు ఎంతో ముద్దుగా చూసుకుంటూ పెంచారు. పద్దెనిమిదేళ్లు గడిచి వాడికి పెళ్ళియీడు వచ్చింది.

## పాలంకి వెంకటరామ చంద్రమూర్తి

తండ్రి, 'నాకు కొడుకు చేతికి అందివచ్చాడు గనుక ఇంక నేను శ్రమపడనక్కర్లేదు. ఇంక రోజూ పొలానికి వాడే వెడతాడు.' అన్నాడు.

తల్లి 'ఔను. వాడికి పెళ్ళికూడా చేసేద్దాం. కోడలువస్తే దానికి పెత్తనం వప్పజెప్పి, నేనుకూడా కృష్ణా, రామా అనుకుంటూ ఒక చోట కూచుంటాను' అంది.

కాని వాళ్లు పెళ్ళికూతుర్ని చూడనక్కర్లేకనేపోయింది. ఏమంటే ఆ కొడుక్కి హఠాత్తుగా జబ్బుచేసి, వైద్యుడు రాకపూర్వమే మరణించాడు!

పుత్రశోకంతో ఆ తల్లీ తండ్రీ గుండెలు బాదుకున్నారు! జుట్టు పీక్కున్నారు!

ఆ తండ్రి అంతటితో ఊరుకోక, 'చేతికి అందివచ్చిన నా కుమారుణ్ణి తీసుకుపోయాడీ యముడు! వీణ్ణేనా "ధర్మరాజు" అంటారు? వీడి మొహం మండా, ఇదేనా వీడి ధర్మం?' అంటూ ఆ దేవుణ్ణి తిట్టిపోశాడు.

ఆ తిట్లు పడలేక యమధర్మరాజు ఒక అర్ధరాత్రివేళ తన దున్నపోతుమీద ఎక్కి భూలోకానికి చక్కావచ్చాడు. మంచంమీద పరుండి నిద్రపోతూన్న ఆ తండ్రికి కలలో ప్రత్యక్షమై, 'ఎందుకోయ్ నన్ను తెగతిట్టిపోస్తున్నావ్?' అని అడిగాడు.

'ఎందుకేమిటి? నువ్వు చేసిన పాడుపనికి! చేతికి అందివచ్చాడనుకుంటూన్న నా కుమారుణ్ణి తీసుకుపోయావు!' అంటూ ఆ తండ్రి కలలోనే యముణ్ణి తిట్టడం ప్రారంభించాడు.

యముడు 'ఆగవోయ్, ఆగు. నాలోకంలో ఇప్పుడు కోటానుకోట్ల జీవులున్నారు. వారిలో నీ కొడుకెవరో నాకేం తెలుస్తుంది?' అన్నాడు.

తండ్రి, 'నీకు తెలియకపోవచ్చుగాని, నేను నా కొడుకుని ఇట్టే ఆనవాలు కట్టేస్తాను!' అన్నాడు

యముడు, 'అలాగైతే నాతో రా.' అని, ఆ తండ్రి జీవాన్ని తన పాశా

## ★ 'కడుపుచిచ్చు' ★

నికి తగిలించుకుని తన లోకానికి తీసుకుపోయాడు.

యముడు చెప్పినట్లు నరకలోకంలో లెక్కకుమీరిన జీవులు తాము చేసుకున్న పాపాలకు ఫలితాలను అనుభవిస్తూ కనపడ్డారు. యముడు తాను తీసుకువచ్చిన ఆ జీవునితో, 'వెళ్ళవోయ్, మీ వాడెక్కడున్నాడో వెతికి పట్టుకుని నావద్దకు తీసుకురా' అని వాణ్ణి వదిలాడు.

ఆ తండ్రి వెతికి వెతికి ఆ కుర్రవాణ్ణి పట్టుకున్నాడు. ఆప్యాయంగా ఆ బాలుని బుజంమీద తట్టుతూ, 'ఒరే అబ్బాయీ, నేనురా మీ నాన్నని!' అన్నాడు.

ఆ బాలుడు వెనక్కి తిరిగిచూసి 'ఛీ, నువ్వా నా తండ్రినంటున్నావు!' అని చీదరించుకుని అసహ్యంతో పురుగును విదల్చినట్లు విదల్చి దూరంగా పోయాడు.

తండ్రి నిర్ఘాంతపోయి, 'నాయనా, నన్నానవాలు పట్టలేదూ? అప్పుడే మరిచిపోయావురా బాబూ? ఈ లోకానికి వచ్చినవాళ్ళకి మరుపు ఇట్టే వస్తుందికామోసు!' అన్నాడు.

ఆ బాలుడు, 'మరుపా? నేనేం మరిచిపోలేదు. నువ్వే మరిచిపోయావు!' అన్నాడు.

తండ్రి మరీ విస్తుపోయి, 'అదేమిట్రా నాయనా. నేనేం మరిచిపోయాను! నీ ముద్దుచేష్టలన్నీ నాకు కళ్ళకు కట్టినట్టున్నాయి' అన్నాడు.

ఆ బాలుడు మండిపడుతూ, 'నా చేష్టలు కాదోయ్ మూర్ఖుడా! నీ చేష్టలు జ్ఞాపకం తెచ్చుకో! క్షుధార్తుడనై లేక లేక దొరికిన చేపను తిందామనుకుంటూంటే నా నోటిలోనిదాన్ని ఎత్తుకుపోయావుకదూ? జ్ఞప్తికి తెచ్చుకో!' అన్నాడు.

తండ్రి 'చేపా? ఏంచేప? ఎప్పటిమాటా, నువ్వు చెప్పేది?' అన్నాడు ఆలోచిస్తూ.

బాలుడు, 'ఎప్పటిమాటా? నేనా సరస్సులో కొంగగా ఉన్నప్పటిమాట!' అన్నాడు.

ఆమాట వినడంతోనే ఆ తండ్రికి ఏనాడో జరిగిన ఆ సంగతి మెల్లిగా జ్ఞాపకానికొచ్చింది. ఆరిపోతూన్న పెదిమలు నాలికతో తడుపుకుంటూ వాడా బాలునితో, 'ఐతే నువ్వు ఆ కొంగవా? నా కొడుకువి కావూ?' అన్నాడు.

బాలుడు, 'ఆ కొంగనే నీ కొడుకునై పుట్టి నా పగను దీర్చుకున్నాను! నా సిద్ధాన్నాన్ని పడగొట్టి నాకు శోకం కలిగించిన దుర్మార్గునికి కొడుకునైపుట్టి, ఆశలు కల్పించి, అందివస్తాననేవేళకి తప్పుకుని నీకు పుత్రశోకం కలిగించాను! ఆ పద్ధెనిమిదేళ్ళూ 'కొడుకా, కొడుకా' అని నువ్వు పిలుస్తోంటే కర్ణకఠోరమైన ఆపిలుపు ఎలాగో సహించాను. ఇంక సహించను! వెళ్ళు!' అంటూ గుంపులో కలిసి మాయమైపోయాడు.

ఆ బాలుని తండ్రిననుకున్న ఆ జీవుడు మొహం వేలాడేసుకుని వస్తోంటే, యమధర్మరాజు, 'ఏమోయ్, ఒక్కడివే వస్తున్నావేం? ఏడీ నీ కొడుకు?' అన్నాడు.

ఆ జీవుడు, 'ప్రభూ, వాడు నా కొడుకు కాడుట. నామూలాన కడుపుచిచ్చు కలిగిన ఒక కొంగట. నాకు కొడుకై పుట్టి, ఈ రకం కడుపుచిచ్చు పెట్టి, పగ దీర్చుకున్నాడట!' అన్నాడు.

యమధర్మరాజు 'చూశావా మరి? అనవసరంగా ఇన్నాళ్ళూ నన్ను తిట్టిపోశావు! నీ పాపఫలం నువ్వు అనుభవించాలిగాని నన్ను తిట్టడం దేనికి... వెళ్ళు. ఆ మంచం మీద ఉన్న నీ కళేబరాన్ని చేరుకో!' అని పంపేశాడు.

★

ఈ నెల 3 వారంలో వెలువడుతాయి!
హోటల్ మహారాణి—'మాలి'
లాకెట్‌లో రహస్యం—'లత'
మూడురంగుల ముఖచిత్రంతో-పాకెట్ సైజు డిటెక్టివ్ నవలలు ఒక్కొక్కటి 100 పే. 8 అణాలు.
బ్రహ్మ వాక్కు—'కాజ'
మూడురంగుల ముఖచిత్రంతో-పాకెట్ సైజు నవల 200 పేజీలు రు. 1-4-0.
ఏజంట్లు తమకు కావలసిన కాపీలకు 25% తగ్గించి ముందుగా పైకం పంపితే మా ఖర్చుల మీద పుస్తకాలు పంపుతాము.
హంస ప్రచురణలు, విజయవాడ-2.



సోల్ ఏజెంట్లు: యునైటెడ్ కామర్స్
54 బందర్ వీధి, మద్రాసు-1.
బ్రాంచీలు: హైదరాబాదు, విజయవాడ